క్లుప్తంగా

ఘనంగా హెలెన్ కెల్లర్ డే



మాట్లాడుతున్న వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి

మదనపల్లె సిటీ: స్థానిక అమ్మచెరువు మిట్టవద్ద నున్న వెలుగు ప్రత్యేక పాఠశాలలో గురువారం హెలెన్ కెల్లర్ డే వేడుకలు నిర్వహించారు. వెలుగు కన్వీనర్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ హెలెన్ కెల్లర్ బాల్యం గురించి వివరించారు. ఆమె ఎంతో మంది దివ్యాంగులకు స్ఫూర్తిదాయకమన్నారు. మనకు చూపులేకపోతే నడవలేమని, ఎటువంటి పనులు చేసుకోలేమని అలాంటిది ఆమె చూపును, వినికిడి, మాటలను కోల్పోయిన కూడా తన ఆత్మ ధైర్యం కోల్పోకుండా ప్రతి ఒక్కరికి మార్గదర్శకురాలుగా మారిందన్నారు. ఆమెను అందరూ స్ఫూర్తిదాయకంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో వెలుగు ప్రిన్సిపాల్ లీనాకుమారి, సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన వేంకటేశ్వరస్వామి ఉత్సవాలు

రామసముద్రం: రామసముద్రం మండలం మినికి బండపై వెలసిన కల్యాణ వేంకటేశ్వర స్వామి ఉత్సవాలలో భాగంగా గురువారం వసంతోత్సవంతో ఉత్సవాలు ముగిశాయి. ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు, కుంకుమార్చనలు ఘనంగా నిర్వహించారు. చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులకు ఆలయ అర్చకులు తీర్థ ప్రసాదాలు అందజేశారు. గ్రామస్తులు స్వామి వారిని గ్రామ పురవీధుల్లో ఊరేగించారు.

అతిసారపై అప్రమత్తత



సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

కలికిరి: వర్షాకాలంలో అతిసారం సోకే అవకాశం ఉందని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్ఈ మహమ్మద్ రఫీ సూచించారు. మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీ పరిధిలోని రాజువారిపల్లి, సత్యాపురం, బోయపల్లి గ్రామాల్లో వైద్య సిబ్బందితో కలసి పర్యటించిన ఆయన ప్రజలకు అవగాహన కల్పించారు. అతిసార, ఇతర సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ప్రజలు జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. టీబీ పర్యవేక్షణ అధికారి నాగిరెడ్డి, ఎంఎల్‌హెచ్‌పీ రాణి, ఏఎన్ఎంలు నఫీస, పార్వతి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

వాల్మీకిపురం: మండలంలో డయేరియా కేసులు పెరుగుతుండడంతో నగిరిమడుగు పీహెచ్‌సీ డాక్టర్ కీర్తి, పంచాయతీ ఈఓ ఉదయ్ కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించినఉచిత వైద్య శిబిరం విజయవంతమైంది. గురువారం పట్టణంతో పాటు పునుగుపల్లి, గొళ్లపల్లి ప్రాంతాల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహించి, డయేరియాపై అవగాహన కల్పించారు. అలాగే కాలువలు, నీటి ట్యాంకులు శుభ్రం చేయించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కాచి చల్లార్చిన నీటిని తాగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పీహెచ్‌సీ సిబ్బంది, సచివాలయ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

చల్లంగ చూడు గంగమ్మా



నడివీధి గంగమ్మ

మదనపల్లె సిటీ: స్థానిక నెహ్రూబజార్‌లోని నడివీధి గంగమ్మ జాతర గురువారం ఘనంగా ముగిసింది. అమ్మవారికి విగ్రహాన్ని ప్రత్యేక వాహనంలో పురవీధుల్లో ఊరేగించారు. తల్లి మమ్మల్ని చల్లంగ చూడు తల్లి అని వేడుకున్నారు.

ఎస్కే యూనివర్సిటీతో ఎంఓయూ

కురబలకోట: ఎస్కే యూనివర్సిటీ అటల్ ఇంకుబేషన్ సెంటర్‌తో అంగళ్లలోని విశ్వం ఇంజినీరింగ్ కళాశాల ఎంఓయూ కుదుర్చుకున్నట్లు ప్రిన్సిపాల్ డి. రమణారెడ్డి గురువారం తెలిపారు. కేంద్రం రూపొందించిన అటల్ ఇంకుబేషన్ సెంటర్ ద్వారా విద్యార్థులకు ఇన్నోవేషన్ స్టార్ట్ అప్స్‌పై అవగాహన కల్పించారు. ఇది విద్యార్థులు పారిశ్రామిక వేత్తలుగా ఎదగడానికి తోడ్పడుతుందన్నారు.

వైఎస్సార్‌సీపీకి రాజీనామా

కలికిరి: కలికిరి మండల జెడ్పీటీసీ సభ్యురాలు కె.పద్మజ వైఎస్సార్‌సీపీకి రాజీనామా చేశారు. గురువారం ఆమె ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటనలో పేర్కొన్నారు.

సాగుకు సానుకూలం

ఆరుతడి పంటల్లో వేరుశనగ ప్రధాన పంటగా చెప్పొచ్చు. నూనె గింజల పంటల్లోనూ వేరుశనగకు ప్రత్యేక స్థానం ఉంది. వేరుశనగ నూనెకు మార్కెట్‌లో మంచి డిమాండ్ ఉంది. ఖరీఫ్‌లో వేరుశనగ పంటను సాగు చేస్తే అధిక లాభాలు పొందవచ్చు. ఈ ఏడాది వర్షాలు ఆశాజనంగా కురుస్తుండడంతో వేరుశనగ సాగుకు అన్నదాతలు ఆసక్తి చూపుతున్నారు. ఆర్బీకే కేంద్రాల్లో విత్తనకాయల్ని పంపిణీ చేస్తున్నారు. సబ్సిడీ ఎరువులను కూడా అందుబాటులో ఉంచారు. దీంతో సాగుకు కర్షకులు సన్నద్ధమవుతున్నారు.

- వేరుశనగ సాగుకు అన్నదాత ఆసక్తి
- 7,854 క్వింటాళ్ల వేరుశనగ కాయలు పంపిణీ
- ఆర్బీకేల్లో సబ్సిడీ ఎరువులు
- నియోజకవర్గంలో 7852 హెక్టర్లలో సాగుకు సన్నద్ధం



వేరుశనగ విత్తనాలు వేస్తున్న రైతులు

మండలాల వారీగా పంపిణీ చేసిన వేరుశనగ విత్తనకాయల వివరాలు

మండలం	రైతుల సంఖ్య	వితనాలుపంపిణీ (మెట్రిక్ క్వింటాళ్లు)
పీలేరు	4215	1805.4
గుర్రంకొండ	1633	1218.8
వాల్మికీపురం	2846	1654.1
కలికిరి	1739	1094.6
కేవిపల్లె	2547	1265.8
కలకడ	1306	986.4



ఆర్బీకేల్లో సిద్ధంగా ఉన్న ఎరువులు

గుర్రంకొండ: ఖరీఫ్ సీజన్‌లో పడమటి మండలాల్లో రైతులకు ముఖ్యమైన పంట వేరుశనగ. వర్షాలు సకాలంలో కురుస్తుండడంతో గ్రామాల్లో వేరుశెనగ పంట సాగు ప్రక్రియ మొదలైంది. నియోజకవర్గంలో 14,286 మంది రైతులు 7,852 హెక్టార్లలో వేరుశనగ పంట సాగు చేయడానికి సన్నద్ధమవుతున్నారు. నియోజకవర్గంలోని అన్ని ఆర్బీకేల పరిధిలో మొత్తం 7,854 క్వింటాళ్ల వేరుశనగ విత్తనకాయల్ని పంపిణీ చేశారు. అన్ని ఆర్బీకేల్లో పంటల సాగుకు అవసరమైన సబ్సిడీ ఎరువులను రైతులకు అందుబాటులో ఉంచారు. దీంతో రైతులు వేరుశనగ విత్తనాలు విత్తే ప్రక్రియ మొదలుపెట్టారు.

7,854 క్వింటాళ్ల విత్తన కాయలు పంపిణీ

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశగన పంట సాగుకు కోసం రైతులకు అవసరమైన సబ్సిడీ విత్తనకాయల్ని ప్రభుత్వం ఆర్బీకేలకు ఇప్పటికే సరఫరా చేసింది. అన్ని మండలాల్లోని ఆర్బీకేల్లో ఈ ఏడాది 7,854 క్వింటాళ్ల విత్తనకాయలను పంపిణీ చేశారు. రైతులు కాయల్ని వలిచి విత్తన గింజల్ని పొలాల్లో విత్తడానికి సిద్ధమయ్యారు.

అందుబాటులో సబ్సిడీ ఎరువులు

వేరుశనగ పంట సాగుకు అవసరమైన ఎరువుల్ని ప్రభుత్వం ఆర్బీకేల్లో రైతులకు అందుబాటులో ఉంచారు. నియోజకవర్గంలోని అన్ని ఆర్బీకేలకు సబ్సిడీ ఎరువులను సరఫరా చేశారు. యూరియా, పొటాష్ (కాంప్లెక్స్), డీఏపీ, ట్రైకోడెర్మా విరిడి మందులను ఇప్పటికే ఆర్బీకేల్లో ఉంచారు. పొటాష్, డీఏపీ తప్పనిసరిగా వేరుశనగ పంట సాగు చేసే పంటపొలాలపై చల్లుతారు. ట్రైకోడెర్మావిరిడి మందును విత్తన గింజల్లో కలిపి పొలంలో చల్లుతారు. ఈ మందు ప్రభావంతో వేరుతొలుచుతో పాటు భూమిలోపల ఉన్న ఇతర పురుగులు విత్తన గింజల జోలికి రాకుండా ఉంటాయి. వేరుశెనగ పంట సాగుకు అవసరమైన ఎరువులు, పురుగుల మందులు సబ్సిడీపై ఆర్బీకేల్లో రైతులకు అందించనున్నారు. దీంతో అధిక ధరలు చెల్లించి ప్రైవేట్ ఎరువుల దుకాణాల్లో వీటిని కొనుగోలు చేసే బెడద రైతులకు తప్పింది.

7,852 హెక్టార్లలో సాగు

నియోజకవర్గంలోని ఆరు మండలాల పరిధిలో 14,826 మంది రైతులు మొత్తం 7,852 హెక్టార్లలో ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగుకు సన్నద్ధమవుతున్నారు. పడమటి ప్రాంతాల్లో ముఖ్యమైన వర్షాధార పంట వేరుశనగ కావడం గమనార్హం. ప్రస్తుతం సకాలంలో వర్షాలు కురుస్తుండడంతో వేరుశనగను విత్తేందుకు ఆసక్తి చూపుతున్నారు.

అందుబాటులో యంత్రాలు

గ్రామాల్లో వేరుశనగ విత్తనాలు విత్తే యంత్రాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. గతంలో ఎద్దులతో మడకల ద్వారా వేరుశనగ విత్తనాలు చల్లేవారు. అయితే ప్రస్తుతం పూర్తిగా యంత్రాలపైనే రైతులు ఆధారపడుతున్నారు. దీంతో ఈ యంత్రాలకు డిమాండ్ ఏర్పడింది. యంత్రాల ద్వారా ఎకరం పొలంలో వెరుశనగ విత్తనాలు విత్తడానికి ఒకటిన్న గంట సమయం పడుతుంది. ఒక గంటకు రూ.1,300 కాగా ఒకటిన్న గంటకు 1,950 ఖర్చు వస్తుంది. ఎకరం పొలంలో యంత్రాల ద్వారా 80కిలోల విత్తనాలు విత్తుతారు. గతంలో అయితే ఎద్దుల మడకలతో వేసే విధానంలో ఎకరానికి 60 కిలోల విత్తనాలు మాత్రమే విత్తడానికి సరిపోయేవని రైతులు అంటున్నారు.

ఎరువులు, మందులు అందుబాటులో ఉంచాం



ఖరీఫ్ సీజన్‌లో వేరుశనగ పంట సాగు చేసే రైతులకు అవసరమైన ఎరువులు, విత్తనశుద్ధి మందులు కుడా ఆర్బీకేల్లో అందుబాటులో ఉంచాం. వేరుశనగ విత్తనకాయలతో పాటు రైతులకు అవసరమైన మేరకు ఎరువులను కుడా పంపిణీ చేశాం. ప్రస్తుతం గ్రామాల్లో వేరుశనగ విత్తనాలు విత్తే ప్రక్రియ ప్రారంభమైంది. పదిహేను రోజుల పాటు విత్తనాలు పొలాల్లో విత్తుకోవచ్చు.

–నవీన్‌కుమార్‌రెడ్డి, ఏఓ, గుర్రంకొండ

రైతు సంక్షేమమే ధ్యేయంగా పనిచేయాలి

ఎమ్మెల్యే షాజహాన్‌బాషా



మున్సిపల్ అధికారులకు సూచనలిస్తున్న ఎమ్మెల్యే షాజహాన్‌బాషా

మదనపల్లె : టమాటా మార్కెట్‌యార్డులో సిబ్బంది రైతుసంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తూ, వారికి కావాల్సిన అన్ని వసతులు కల్పించాలని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ఆదేశించారు. గురువారం మార్కెట్ యార్డును సందర్శించిన ఆయన... పారిశుధ్య నిర్వహణపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డులో వసతులు కల్పించాలని మార్కెట్ సెక్రటరీ అభిలాష్‌ను ఆదేశించారు.

తాగునీటి సరఫరాకు చర్యలు

పట్టణంలో మూడురోజులకు ఒకసారి తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే షాజహాన్‌బాషా అన్నారు. గురువారం పట్టణంలోని ఇందిరానగర్‌లో పర్యటించిన ఆయనకు తాగునీటి సరఫరా, పారిశుధ్య నిర్వహణపై ప్రజలు ఫిర్యాదులు చేశారు. పదిరోజులకు ఒకసారి నీటిసరఫరా జరుగుతోందని చెప్పడంతో స్పందించిన ఎమ్మెల్యే మున్సిపల్ కమిషనర్ ప్రమీలకు తక్షణమే సమస్య పరిష్కరించాల్సిందిగా ఆదేశించారు.

ట్రాఫిక్ సమస్య పరిష్కరించాలని వినతి

మదనపల్లె సిటీ: మదనపల్లెలో ట్రాఫిక్ సమస్యను పరిష్కరించాలని మదనపల్లె పట్టణ అపెక్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ నాయకులు ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు వినతిపత్రం అందజేశారు. ట్రాఫిక్ సమస్య కారణంగా ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు తెలిపారు. శాశ్వత పరిష్కారం చొరవ చూపాలన్నారు. అధికారులతో కమిటీ వేసి సమస్యలను పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో మదనపల్లె పట్టణ అపెక్స్ వెల్‌ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు గొల్లపూడి తిరుపతిరావు, సభ్యులు టీఎస్ఎ క్రిష్ణమూర్తి, వై.ఎస్.మునిరత్నం, రెడ్డప్పరెడ్డి, శకుంతలమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి గోల్డ్ మెడల్



విద్యార్థినిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

పీలేరు : స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో పదో తరగతి పరీక్షల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినికి బంగారు పతకాన్ని బహూకరించారు. అదే పాఠశాలలో 23 సంవత్సరాలు పని చేసి హెచ్ఎంగా పదవీవిరమణ పొందిన పద్మావతమ్మ ప్రతి ఏడాది విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు అందజేస్తున్నారు. ఇందులో భాగంగా ప్రసన్నలక్ష్మికి బంగారు పతకంలో అభినందించారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం ఫౌజియాబేగం, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలు పరిష్కరించాలి



తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా రైతాంగం ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు రాష్ట్రప్రభుత్వం చర్యలు తీసుకోవాలని రైతు, వ్యవసాయ, కార్మికసంఘాలు, సీపీఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రైతాంగ సమస్యలపై మండల తహసీల్దార్ రమాదేవికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా సీపీఐ నియోజకవర్గ నాయకులు కృష్ణప్ప మాట్లాడుతూ.. ప్రభుత్వం ప్రకటించిన సాగు సాయం రూ.20 వేలు రైతులకు ఖరీఫ్ సీజన్‌లోనే అందించాలన్నారు. పెరిగిన ఉత్పత్తి ఖర్చులకు అనుగుణంగా స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ నుంచి పెంచిన పంట రుణాలు మూడు లక్షల వరకు వడ్డీలేకుండా, పావలా వడ్డీ రుణంతో ఐదులక్షల వరకు రుణాలు ఇవ్వాలన్నారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చే ప్రక్రియ చేపట్టి రుణాలు అందించాలన్నారు. రాష్ట్రంలో ప్రాజెక్ట్ కింద ఉన్న ప్రధాన కాలువలు, మేజర్, మైనర్ కాలువలతో పాటు డెల్టా ప్రాంతాల్లో మురుగునీటి కాలువల మరమ్మతులు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గసభ్యులు ఎం.సాంబశివ, వ్యవసాయ కార్మికసంఘం ఏరియా కార్యదర్శి చంద్రశేఖర్, సీపీఐ నాయకులు తిరుమలరెడ్డి, మునికాటయ్య, రవికుమార్, గౌరి పాల్గొన్నారు.

న్యాయపరమైన సమస్యలు పరిష్కరించండి



మంత్రి మండిపల్లెకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న రెవెన్యూ అధికారులు

రాయచోటి టౌన్ : తమ న్యాయపరమైన సమస్యలను పరిష్కరించాలని అన్నమయ్య జిల్లా ఏపీ రాష్ట్ర రెవెన్యూ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షులు నరసింహాకుమార్ ఆధ్వర్యంలో రాష్ట్ర రవాణా, క్రీడా, యువజన శాఖ మంత్రి మండిపల్లె రాంప్రసాద్‌రెడ్డికి వినతి పత్రాన్ని సమర్పించారు. గురువారం రాయచోటి పట్టణంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో రెవెన్యూ సిబ్బంది తమ అసోసియేషన్ సభ్యులతో కలసి మంత్రిని మర్యాద పూర్వకంగా కలసి పుష్పగుచ్ఛం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ రెవెన్యూ శాఖలో తమ ఉద్యోగులు పలు రకాల సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వాటి పరిష్కారానికి ప్రభుత్వం చర్యలు తీసుకునేలా చొరవ చూపాలని కోరారు. దీనిపై స్పందించిన మంత్రి సమస్యను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి న్యాయం చేస్తానని హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆ శాఖ అధికారులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



ఏపీ హంస అసోసియేషన్ కార్యవర్గం

పీలేరు : ఏపీ హంస (ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేషన్ మెడికల్ సర్వీసెస్) అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక చిత్తూరు జిల్లా అధ్యక్షులు రాజా ఆధ్వర్యంలో పీలేరు ప్రభుత్వాస్పత్రిలో గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీలేరు తాలూకా అధ్యక్షుడిగా కొండయ్య, ఉపాధ్యక్షుడిగా శ్రీనివాసులు, భారతమ్మ, అసోసియేట్ ప్రెసిడెంట్‌గా షరీఫ్‌జాన్, కార్యదర్శిగా బి. మోహన్, ట్రెజరర్‌గా నవీన్, ప్రచార కార్యదర్శిగా ద్రాక్షాయణి, మహిళా కార్యదర్శిగా వాణి, సభ్యులుగా ప్రమీలకుమారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టాటాబాయ్, ఉపాధ్యక్షులు ఇమ్రాన్, ఎలక్షన్ అధికారి గీతారాణి పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత బంకిం చంద్ర ఛటర్జీ



బంకిం చంద్ర ఛటర్జీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు

వాల్మీకిపురం: వందేమాతరం గీత రచయిత బంకిం చంద్ర ఛటర్జీ స్ఫూర్తి ప్రదాత అని జేవీవీ అధ్యక్షుడు ప్రభుచరణ్ కొనియాడారు. బంకిం చంద్ర ఛటర్జీ జయంతి వేడుకలను జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. గురువారం మండలంలోని చింతపర్తి జెడ్పీ ఉన్నత పాఠశాలలో బంకిం చంద్ర ఛటర్జీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ప్రభుచరణ్ మాట్లాడుతూ భారతదేశంలోని గొప్ప కవులు, నవలా రచయితలలో బంకిం చంద్ర ఛటర్జీ ఒకరన్నారు. స్వాతంత్ర్య సంగ్రామంలో వందేమాతరం అనే నినాదం సంజీవనిలా పనిచేసిందని గుర్తుచేశారు. ఆనంద్‌మఠ్ అనే గ్రంథంలో ఆయన వందేమాతరం గేయాన్ని రచించారని తెలిపారు. హెచ్ఎం రెడ్డెప్ప రెడ్డి, ఉపాధ్యాయులు దామోదరం, రమేష్, శ్రీరాములు, యోగరంజని, యుగంధర్, సువర్ణ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు తక్షణమే చెల్లించాలి



ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓకు వినతిపత్రం అందజేస్తున్న ఏఐటీయూసీ నాయకులు

మదనపల్లె : రాష్ట్రవ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తున్న గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు పెండింగ్ వేతనాలను తక్షణమే చెల్లించాలని గ్రీన్ అంబాసిడర్ వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ అనుబంధం) రాష్ట్ర కార్యదర్శి శ్రీరాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి సాంబశివ డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీఓ కార్యాలయంలో డీఏఓకు ఏఐటీయూసీ ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. స్వచ్ఛభారత్ కార్మికులకు వేతనం రూ.6వేల నుంచి 10వేలు పెంచుతూ జారీచేసిన జీఓ 680 ప్రకారంగా 15వ ఫైనాన్స్ నుంచి వేతనాలు ఇస్తామని చెప్పి ఇవ్వలేదన్నారు. 30నెలల నుంచి వేతనాలు లేకపోవడంతో కార్మికులు చాలా మంది పని మానుకుంటున్నారని, అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం గ్రీన్ అంబాసిడర్ కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. స్వచ్ఛభారత్ కార్మికులకు అవసరమైన పనిముట్లు, పరికరాలు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు.

క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యం



బీసీజీ టీకా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి తదితరులు

కలకడ : క్షయవ్యాధి నిర్మూలనే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కిషోర్‌కుమార్‌రెడ్డి అన్నారు. బీసీజీ టీకాతో టీబీ వ్యాధిని నయం చేయవచ్చని తెలిపారు. గురువారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సి పరిధిలోని ముడియంవారిపల్లె పంచాయతీ గొళ్లపల్లె, కె.దొడ్డిపల్లె పంచాయతీ గోపాలపురం, కదిరాయచెర్వు పంచాయతీ వడ్డిపల్లె, దేవులపల్లె పంచాయతీ వడ్డిపల్లె గ్రామాలలో నిర్వహిస్తున్న బీసీజీ టీకా కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, సూపర్‌వైజర్ వెంకటేశ్వరావు, సుబ్బరత్నమ్మ, సిబ్బంది లక్ష్మి, పద్మావతి పాల్గొన్నారు.

ప్రమాద బీమాను సద్వినియోగం చేసుకోండి

పీలేరు రూరల్ : ప్రమాదబీమాను సద్వినియోగం చేసుకోవాలని తిరుపతి తపాలా శాఖ ఎస్ఎస్‌పీ జె.ఎం. వసంత అన్నారు. గురువారం స్థానిక తపాలాశాఖ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 నుంచి 60 సంవత్సరాల వారికి ఏడాదికి రూ. 549 చెల్లిస్తే రూ. 10 లక్షలు, రూ. 749 చెల్లిస్తే రూ. 15 లక్షలు ప్రమాద బీమా పొంద వచ్చునని తెలిపారు. మహిళలకు సమ్మాన్ సేవింగ్స్ సర్టిఫికెట్ పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. సుకన్య సంవృద్ధి యోజన, కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెడుతున్న పథకాలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పోస్టల్ ఇన్‌స్పెక్టర్ వినోద్‌కుమార్, పోస్ట్ మాస్టర్ అబ్దుల్ సాహెబ్, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తే మోక్ష మార్గం



ప్రచారం చేస్తున్న సభ్యులు

కలకడ : భక్తే మోక్ష మార్గమని సమరసత సేవాఫౌండేషన్ అన్నమయ్య జిల్లా కన్వీనర్ శ్రీధర్‌రాజు అన్నారు. గురువారం మండలంలోని కలకడ పంచాయతీ కొత్తపల్లెలోని సీతారాముల ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, పార్థివమహారతులు, నగర సంకీర్తన, గ్రామ ధార్మిక సమితుల సమావేశం ఏర్పాటు చేసి హిందూ ధర్మం, ఆచరణ, తదితర కార్యక్రమాలపై వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ హింసను విడనాడి శాంతి, ధర్మ, భక్తి మార్గాలలో వ్యక్తులు పయనించాలని కోరారు. ధర్మాన్ని కాపాడండి– ధర్మమే మిమ్మల్ని కాపాడుతుందన్నారు.మహిళాసహకన్వీనర్ రమణమ్మ, జిల్లా ప్రభుత్వసంబంధాలప్రముఖ్ వెంకట్రమణ రెడ్డి, ధర్మప్రచారపరిషత్‌సభ్యులు సుబ్బరాయుడు, హరినాథ్, శ్రీనివాసులు, రమణ, పాల్గొన్నారు.

ముగిసిన మహాభారత యజ్ఞం



కళాకారులను అభినందిస్తున్న కమిటీ సభ్యులు

రామాపురం : మండల కేంద్రంలో 18 రోజులపాటు జరిగిన మహాభారత యజ్ఞం కార్యక్రమం గురువారంతో ముగిసింది. 18 రోజులపాటు ఉదయం మహాభారతాన్ని హరికథ రూపంలో, రాత్రి సమయాల్లో పౌరాణిక నాటకాల రూపంలో ప్రజలకు వివరించారు. మహాభారత యజ్ఞం ఏర్పాటు చేయడం వల్ల ఆ మండల ప్రాంత వాసులు సుఖసంతోషాలతో ఉంటారని, పాడి పంటలు సమృద్ధిగా ఉంటాయని వర్షాలు బాగా కురుస్తాయన్న నమ్మకంతో ఈ మహాభారత యజ్ఞాన్ని ఏర్పాటు చేశారు. పురాణ గాథలు వినడం వల్ల మానసిక ప్రశాంతత లభించడమే కాకుండా ఆయు రారోగ్యాలతో ఉంటారన్న ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. బుధవారం రాత్రి జరిగిన అగ్నిగుండ ప్రవేశంలో ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు.

అపరిశుభ్రతతో విష జ్వరాలు ప్రబలే అవకాశం

- పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- మురుగు నీరు నిల్వ ఉండకుండా అధికారులు చర్యలు చేపట్టాలి
- జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మనోరమ



మాధవరం-1లో పూడికతీత పనులును పరిశీలిస్తున్న జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మనోరమ

సిద్దవటం : గ్రామాల్లో అపరిశుభ్రంగా ఉండటం వల్ల ప్రజలకు విషజ్వరాలు వచ్చే అవకాశాలు ఉన్నాయని జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మనోరమ తెలిపారు. సిద్దవటం మండలం మాధవరం-1 గ్రామ పంచాయతీ పరిధిలోని మహబూబ్ నగర్‌లో గురువారం జరుగుతున్న పారిశుధ్య పూడికతీత పనులను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడప – చెన్నై ప్రధాన రహదారిలోని మాధవరం-1 గ్రామంలో రోడ్డుకు ఇరువైపుల డ్రైనేజీ నీరు పోకుండా నీరు నిల్వ ఉండటం వల్ల విష జ్వరాలు సోకుతాయన్నారు. మురుగు నీరు నిల్వ ఉండటంపై ఆమె అసహనం వ్యక్తం చేశారు. అందుకే మహేష్ అనే బాలుడికి డెంగ్యూ పాజిటివ్ నిర్ధారణ అయిందన్నారు. మలేరియా సబ్ యూనిట్ అధికారి ఇండ్ల సుబ్బరాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో ఉన్న ప్రజలు ప్రతి ఒక్కరూ మీ పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ముఖ్యంగా నీరు నిల్వ లేకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని పొడిచెత్త, తడిచెత్తను హరిత రాయబారుల వాహనంలో వెయ్యాలని, ఎక్కడ పడితే అక్కడ వేయకూడదని ఆయన ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాధవరం పీహెచ్‌సీ వైద్యాధికారిణి డాక్టర్ శ్రీవిద్య, సూపర్‌వైజర్ రమణయ్య, ఆరోగ్య కార్యకర్త సుజాత, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనరసయ్య, ఆశ వర్కర్‌లు, పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

బెటాలియన్ పాఠశాల తనిఖీ

ఏపీఎస్పీ 11వ బెటాలియన్ ఆవరణలో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను గురువారం జిల్లా మలేరియా అధికారిణి డాక్టర్ మనోరమ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె విద్యార్థుల తాగునీటి ట్యాంకును పరిశీలించారు. అనంతరం విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ డెంగ్యూ, మలేరియాల పట్ల విద్యార్థులు తీసుకోవాల్సిన జాగ్రతలపై అవగాహన కల్పించారు. రాత్రి వేళలో ప్రతి ఒక్కరూ దోమ తెరలను వాడాలని, ప్రతి ఒక్కరూ శుభ్రంగా ఉండాలన్నారు. దోమల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రతలపై విద్యార్థినీ, విద్యార్థులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చామన్నారు. దోమలు కుట్టడం వల్ల మలేరియా, డెంగ్యూ, జ్వరాలు వస్తాయని ప్రతి ఒక్కరూ రాత్రి వేళల్లో ఫుల్ వస్త్రాలను ధరించాలన్నారు. దోమలు రాకుండా మీ ఇంటి పరిసర ప్రాంతాల్లో వేప పొగను వేస్తే దోమలను నియంత్రణ చేయవచ్చునని తెలియజేశారు. భోజనం చేసే సమయంలో ప్రతి విద్యార్థి చేతులను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. పాఠశాలలో బాత్రూంలను పరిశుభ్రంగా ఉండేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని తెలియజేశారు.